జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 24 | సెప్టెంబర్ | 2026 ◆ పేజీలు : 5



## అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు

- కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి
- రెడ్ అలర్ట్ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబర్ 23 ,(ప్రజాజ్యోతి)** అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రెడ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలపై

మిగతా 2 లో...

## గాలివాన బీభత్సం.. మొరంపల్లి బంజర్‌లో కలకలం



- ఒక్కసారిగా కమ్ముకున్న చీకట్లు.. గాలికి ఎగిరిపడ్డ చెట్లు, రేకులు
- భయంతో పరుగులు తీసిన ప్రజలు..

**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 23 (ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం మొరంపల్లి బంజర్‌లో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా వీచిన బలమైన ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి.కొద్దిసేపు ఉరుములు,ఈదురుగాలులలతో కూడిన వాతావరణం నెలకొనడంతో గ్రామంలో భయానక పరిస్థితులు ఏర్పడ్డాయి.ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై చీకట్లు కమ్ముకోవడంతో ఏం జరుగుతుందో తెలియక ప్రజలు ఆందోళనకు గురయ్యారు. బలమైన గాలుల ధాటికి గ్రామంలోని పలు ప్రాంతాల్లో భారీ చెట్లు నేలకూలాయి.ఇళ్లు, దుకాణాలకు సంబంధించిన రేకులు,ఇతర సామగ్రి గాలికి ఎగిరిపడ్డాయి. రోడ్లపై ఉన్న వస్తువులు సైతం గాలికి కొట్టుకుపోయాయి.ఆ సమయంలో బయట ఉన్న

మిగతా 2 లో...



## రూ. 275 కోట్లతో భద్రాద్రి ఆలయం అభివృద్ధి

- భద్రాద్రి, సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకున్న మంత్రి పొంగులేటి
- సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా భద్రాద్రి ఆలయాన్ని ప్రణాళిక బద్ధంగా రూపొందించాలి
- శ్రీరామనవమికి ముందే భద్రాచలం ఆలయ పనులు పూర్తి చేయాలి
- దేవుడికి కూడా ద్రోహం చేసిన చరిత్ర టిఆర్ఎస్ ది
- రెవెన్యూ ,గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి

**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 23,(ప్రజా జ్యోతి)** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా భద్రాచలం సీతారామచంద్ర స్వామి వారి ఆలయ అభివృద్ధిని ప్రణాళికబద్ధంగా రూపొందించాలని రెవెన్యూ ,గృహ నిర్మాణ ,సమాచార శాఖ మంత్రి పొంగిలేని శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు, మంత్రి పొంగులేటి జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం పాల్వంచలోని పలు గణేష్ ఉత్సవ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం మంత్రి నేరుగా భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి ఆలయానికి చేరుకున్నారు, ఆలయానికి చేరుకున్న మంత్రి పొంగులేటి కి జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ,భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ,ఆలయ ఈవో లు ఘనంగా స్వాగతం పలికారు, అనంతరం మంత్రి సీతారామచంద్రస్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు, ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆశీర్వదించి శేష వస్త్ర ప్రసాదాలను అందజేశారు, అనంతరం మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజులతో కలిసి మంత్రి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఉత్తర ద్వారం వద్ద ఉన్న దమ్మక్క విగ్రహం ప్రాంతం నుంచి పరిశీలన ప్రారంభించి, వివిధ నిర్మాణ పనుల పురోగతి, ప్రస్తుత దశ, పూర్తికి అవసరమైన సమయం, మానవ వనరులు, నిర్మాణ సామగ్రి తదితర అంశాలపై

మిగతా 2 లో...

## నిండుకుండల కిన్నెరసాని రిజర్వాయర్

- రిజర్వాయర్ లోకి భారీగా చేరుతున్న వరద నీరు
- 405.01 అడుగులకు చేరిన నేటి మట్టం
- ఇన్ఫ్లో 5500 కి క్యూసెక్కులు



**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబరు 23,,(ప్రజా జ్యోతి)** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పాల్వంచ మండల పరిధిలోని కిన్నెరసాని రిజర్వాయర్ లోకి భారీగా వరద నీరు చేరుతుంది, ఈ కారణంగా 407 అడుగుల సామర్థ్యం కలిగిన కిన్నెరసాని రిజర్వాయర్ నీటి మట్టం బుధవారం 405.01 అడుగులకు చేరుకుంది, విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో పాకాల కొత్తగూడెం. మహబూబాద్. గుండాల. టేకులపల్లి. అటవీ ప్రాంతాల నుంచి భారీగా వరద పోటు పెరిగింది .దీంతో కిన్నెరసాని రిజర్వాయర్ లోకి ఇన్ ఫ్లో 5500 క్యూసెక్ల నీరు చేరుతుంది. గంట గంటకు

మిగతా 2 లో...

## పంట పొలాలే పాఠశాలకు దారి

- పాఠశాలకు దారి కల్పిస్తామని హామీ ఇచ్చి వెనక్కి తగ్గిన స్థల దాత
- రాకపోకలకు మార్గం లేక విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు
- దారి సౌకర్యం లేక పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్న తల్లిదండ్రులు
- ప్రభుత్వ పాఠశాలను కాపాడేందుకు తక్షణమే దారి ఏర్పాటు చేయాలని డిమాండ్
- 15 ఏళ్లుగా విద్యార్థుల నరకయాతన.. పట్టించుకోని అధికారులు



**సుజాతనగర్ సెప్టెంబర్ 23 (ప్రజా జ్యోతి):** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 21వ డివిజన్ సుజాత నగర్ మండలం లోని గొల్లగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

మిగతా 2 లో...

## అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి...)

ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు వివిధ శాఖల అధికారులకు సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వాగులు, చెరువులు, వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరమైన చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలో 24 గంటలూ అందుబాటులో ఉండే కంట్రోల్ రూమ్, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి ప్రజలకు తక్షణ సహాయం అందించాలని కలెక్టర్లను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాగులు, చెరువులు, వరద ప్రవాహ ప్రాంతాల వైపు వెళ్లవద్దని మంత్రి కోరారు.

## గాలివాన బీభత్సం.. మొరంపల్లి బంజర్‌లో కలకలం

(మొదటి పేజీ తరువాయి...)

కొందరు గాలి తీవ్రతకు కొంతదూరం నెట్టుకుపోయినట్లు స్థానికులు తెలిపారు.దీంతో పలువురు భయంతో పరుగులు తీశారు. ఈ ఘటనలో కొందరికి స్వల్ప గాయాలైనట్లు సమాచారం.


**– కళ్లముందే ఎగిరిపోయిన రేకులు**

గాలి తీవ్రత ఒక్కసారిగా పెరగడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి కూడా భయపడినట్లు స్థానికులు తెలిపారు. ‘‘ఒక్కసారిగా చీకట్లు కమ్ముకున్నాయి. భారీగా ఈదురుగాలులు వీచడంతో ఏం జరుగుతుందో అర్థం కాలేదు.కళ్లముందే చెట్లు, రేకులు గాలికి ఎగిరిపడ్డాయి.ఇంతటి బలమైన గాలిని గతంలో ఎప్పుడూ చూడలేదు’’ అని పలువురు స్థానికులు పేర్కొన్నారు.

**– తప్పిన పెను ప్రమాదం**

గాలివాన సమయంలో చెట్లు, రేకులు ఎగిరిపడినప్పటికీ ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే గాలుల ధాటికి ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.గాలివాన కారణంగా జరిగిన నష్టంపై అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.దెబ్బతిన్న ఇళ్లు,దుకాణాలు,నేలకూలిన చెట్లు తదితర వివరాలను అధికారులు సేకరించాల్సి ఉంది.స్థానికులు ఈ ఘటనను సుడిగాలిగా పేర్కొంటున్నప్పటికీ.. ఇది సుడిగాలా, టోర్నాడోనా లేదా బలమైన ఈదురుగాలుల ప్రభావమా అనేది సంబంధిత అధికారులు,వాతావరణ నిపుణుల పరిశీలన అనంతరం అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది.

## నిండుకుండల కిన్నెరసాని రిజర్వాయర్



(మొదటి పేజీ తరువాయి...)

రిజర్వాయర్ నీటి మట్టం స్వల్పంగా పెరుగుతుండడంతో జెన్కో డ్యాం సైట్ అధికారులు సమీక్ష నిర్వహించారు. తుఫాన్ ప్రభావం పెరుగుతుండడంతో నీటి మట్టం 406 అడుగులు దాటితే గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు, కిన్నెరా రిజర్వాయర్ నీడిమట్టం పెరుగుతుండడంతో జెన్కో అధికారులు కేంద్ర సాని పరివాహక ప్రాంతాల ప్రజలను ముందస్తుగా మైక్ ద్వారా అప్రమత్తం చేస్తున్నారు, అదేవిధంగా రైతులు పశువులను బయటకు వదలరాదని, విద్యుత్ మోటార్లను జాగ్రత్తపరచుకోవాలని జెన్కో అధికారులు సూచించారు

# రూ. 275 కోట్లతో భద్రాద్రి ఆలయం అభివృద్ధి





(మొదటి పేజీ తరువాయి...)

అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. లిఫ్టులు, స్లాబ్‌లు, రాతి పనులు, రహదారుల అభివృద్ధి, నిర్మాణ సామగ్రి లభ్యత, సిబ్బంది సమీకరణ, అదనపు నిధులు, సాంకేతిక సమన్వయం తదితర అంశాలపై పనుల వారీగా పురోగతిని పరిశీలించారు. ప్రతి విభాగానికి స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించి, వారంవారీ ప్రణాళిక ప్రకారం పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

ఈ సందర్భంగా మంత్రి మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ పునరుద్ధరణ, అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.275 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు.గత ప్రభుత్వం భద్రాద్రి ఆలయ అభివృద్ధి గురించి ఏమాత్రం పట్టించుకోలేదని, దేవుడికి కూడా ద్రోహం చేసిన చరిత్ర టిఆర్ఎస్ గాని అన్నారు , సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం కోట్ల రూపాయలతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు ,ఇప్పటికే పనులు వేగం పుంజుకున్నాయని, నిర్ణీత కాలవ్యవధిలో నాణ్యతతో పూర్తి చేసేందుకు అధికారులు సమగ్ర ప్రణాళికతో పనిచేయాలని తెలిపారు. శ్రీరామనవమికి ముందుగానే ప్రధాన పనులు పూర్తయ్యేలా రివర్స్ ప్లానింగ్ రూపొందించుకోవాలని, గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఆలయం, మాడ వీధులు, అంతర్గత ప్రాకారం, బాహ్య ప్రాకారం తదితర ప్రాంతాల్లో చేపడుతున్న పనులను ముందుగానే పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.

లిఫ్ట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి ప్రతి మూడు రోజులకు ఒక లిఫ్ట్ పనిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన మానవ వనరులను పెంచుకోవాలని, సిబ్బంది కొరత వల్ల పనులు నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

నిర్మాణ సామగ్రి అందుబాటులో లేక పనులకు అంతరాయం కలగకుండా సెంటరింగ్ తదితర సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచాలని, అవసరమైన చోట బూమ్ పంపులు, ఇతర యంత్ర పరికరాలను వినియోగించి పనుల సామర్థ్యాన్ని పెంచాలని తెలిపారు.స్లాబ్ పనుల్లో ఒక దశ పూర్తయ్యే వరకు తదుపరి దశకు సంబంధించిన ఏర్పాట్లు ఆలస్యం కాకుండా సమాంతరంగా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. పనుల మధ్య ఖాళీ సమయం తగ్గించి నిరంతరాయంగా నిర్మాణ కార్యకలాపాలు కొనసాగేలా సమన్వయం చేసుకోవాలని చెప్పారు. ప్రతి పనికి వారంవారీ లక్ష్యాలను నిర్దేశించి, ఆ లక్ష్యాల మేరకు పురోగతి లేకపోతే కారణాలను వెంటనే గుర్తించి పరిష్కరించాలన్నారు.

రాతి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన నిపుణులు, సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించి రోజువారీ లక్ష్యాలతో పనులు నిర్వహించాలని తెలిపారు. చివరి దశలో రాతి పనులు పెండింగ్‌లో ఉండకుండా ముందుగానే పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. గతంలో చేపట్టిన భారీ ఆలయ, జాతర ప్రాంతాల నిర్మాణ పనుల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు సమన్వయంతో ముందుకు సాగాలని తెలిపారు. ఆలయ నిర్మాణంలో నాణ్యతతో పాటు శాస్త్రోక్తతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు.

ఆలయ సంప్రదాయాలు, నిర్మాణ విధానాలకు అనుగుణంగా పనులు సాగుతున్నాయా అనే అంశాన్ని సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెప్పారు. నిర్మాణ నాణ్యతలో ఎలాంటి లోపాలకు తావులేకుండా పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలని ఆదేశించారు. ఆలయ పరిసర రహదారుల అభివృద్ధికి సంబంధించి సుమారు రూ.25 కోట్ల ప్రతిపాదనను త్వరితగతిన మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను సమన్వయంతో అభివృద్ధి చేయాలని సూచించారు. ఆలయ పనుల పురోగతిపై ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని తెలిపారు. నిర్ణీత గడువులు, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ సమన్వయంతో పనిచేసి పనులను సకాలంలో పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, దేవస్థానం ఈఓ దామోదర్ రావు, ఇంజనీరింగ్ అధికారులు, ఆర్కిటెక్టులు, సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# పంట పొలాలే పాఠశాలకు దారి

(మొదటి పేజీ తరువాయి...)

విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు సరైన రహదారి లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల ఏర్పాటై సుమారు 15 సంవత్సరాలు గడుస్తున్నా.. ఇప్పటికీ కనీస రహదారి సౌకర్యం కల్పించకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలను నిర్మించేందుకు స్థలం లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడగా గ్రామ పెద్ద మనిషి 2011 లో వీర్ల వెంకటేశ్వర్లు పాఠశాల కట్టిస్తానని ముందుకు వచ్చారు పాఠశాలను తమ భార్య పేరు మీద కట్టిస్తానని మాటిచ్చారు అందుకు గ్రామస్తులు అధికారులు కూడా అంగీకరించారు. దారి ఇస్తానని మండల ప్రజల సాక్షి బాండ్ పేపర్ రాసి మరీ మాట ఇచ్చి స్థలాన్ని ఇచ్చిన పెద్ద మనిషి మాటను నిలబెట్టుకోకుండా మాట తప్పాడు విద్యార్థులు సుమారు 400 మీటర్ల మేర వ్యవసాయ భూమి, పత్తి చేను గుండా నడిచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాకాలంలో ఈ మార్గం మరింత ప్రమాదకరంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. చేను మార్గంలో నడిచే సమయంలో పాములు, తేళ్లు తదితర విషపూరిత జీవులు విద్యార్థులను కుడితే ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులకు ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని వారు ప్రశ్నిస్తున్నారు.



**పాఠశాల నిర్మించారు.. దారి మాత్రం మరిచారు.**

స్థానికుల వివరాల ప్రకారం.. గతంలో పాఠశాల భవన నిర్మాణ పనులకు టెండర్ ప్రక్రియ జరిగి భవనం నిర్మించారు. అయితే పాఠశాల భవనం పూర్తయినా విద్యార్థులు సురక్షితంగా పాఠశాలకు చేరుకునేందుకు అవసరమైన రహదారి సౌకర్యం మాత్రం అందుబాటులోకి రాలేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. పాఠశాలకు దారి కల్పిస్తామని గతంలో హామీలు వచ్చినప్పటికీ ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదని వారు అంటున్నారు.

**ప్రభుత్వం వెంటనే స్పందించాలి**

విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని పాఠశాలకు తక్షణమే రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పిల్లలు ప్రతిరోజూ ప్రమాదకరమైన దారిలో పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి మారాలి.. బడి ఉన్న చోటుకు బాట కూడా ఉండాలి అని గ్రామస్థులు కోరుతున్నారు.

# ఉచిత హోమియో వైద్య శిబిరం

- ఆయుష్ వైద్య విధానాలపై అవగాహన కార్యక్రమం
- మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి - డాక్టర్ పూజ





**చర్ల, సెప్టెంబర్ 23:(ప్రజా జ్యోతి):** జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో బుధవారం ఉచిత హోమియో వైద్య శిబిరం, ఆయుష్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హోమియో వైద్యురాలు డాక్టర్ పూజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో అనారోగ్యంతో ఉన్న విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా హోమియో మందులు అందించారు.ఈ సందర్భంగా డాక్టర్ పూజ విద్యార్థులకు ఆయుష్‌వైద్య విధానాలపై అవగాహన కల్పించారు. ఆయుష్‌లో ఆయుర్వేదం, యోగా–ప్రకృతి వైద్యం, యునాని, సిద్ధ, హోమియోపతి వైద్య విధానాలు ఉన్నాయని వివరించారు. ఆరోగ్య పరిరక్షణలో సంప్రదాయ వైద్య విధానాల ప్రాధాన్యతను తెలియజేస్తూ, అవసరమైన సందర్భాల్లో అర్హత కలిగిన వైద్యుల సలహా తీసుకోవాలని సూచించారు.అనంతరం బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, రుతుస్రావ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మానసిక ఆరోగ్యం తదితర అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. రుతుస్రావ సమయంలో పరిశుభ్రత పాటిస్తూ శానిటరీ ప్యాడ్లను సక్రమంగా వినియోగించాలని, వాటిని తరచూ మార్చుకోవాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు ఎదురైతే సిగ్గుపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు లేదా వైద్య సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.యుక్తవయస్సులో విద్యార్థులు అపరిచితుల మాయమాటలకు లోనుకాకుండా జాగ్రత్తగా ఉండాలని, తమ చదువు, భవిష్యత్తుపై దృష్టి సారించాలని ఏదైనా ఇబ్బంది ఎదురైతే నమ్మకమైన పెద్దలకు వెంటనే తెలియజేయాలని చెప్పారు. అలాగే పరీక్షల భయం, ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలను ఒంటరిగా ఎదుర్కోకుండా కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, స్నేహితులతో పంచుకోవాలని యోగా, ధ్యానం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించాలని తెలిపారు. మానసిక ఆరోగ్యం కూడా శారీరక ఆరోగ్యంతో సమానంగా ముఖ్యమని అన్నారు.విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని డాక్టర్ పూజ సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రయోగశాల సాంకేతిక నిపుణుడు గోపి, హోమియో ఔషధ విక్రేత శ్రీకాంత్, వైద్య సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థుల ఉన్నతికి అండగా దాతలు



**చర్ల, సెప్టెంబర్ 23 (ప్రజా జ్యోతి ):** గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని వనవాసీ కళ్యాణ పరిషత్ ప్రాంత మహిళా సహ ప్రముఖ్ పెద్దాడ ఆశాలత అన్నారు. చర్లకు చెందిన వస్త్ర వ్యాపారి గాదంశెట్టి నరసింహారావు–ప్రసన్నలక్ష్మి దంపతులు నరసింహారావు మాతృమూర్తి చెంచులక్ష్మి వర్ధంతి సందర్భంగా కొమరం భీం విద్యార్థి నిలయానికి బియ్యం, భోజనం, పండ్లు, స్వీట్లు అందజేశారు.విద్యార్థి నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆశాలత మాట్లాడుతూ నరసింహారావు దంపతులు అనేక సందర్భాల్లో విద్యార్థి నిలయానికి సహకరిస్తూ దాతృత్వాన్ని చాటుకుంటున్నారని అన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది దాతలు పేద విద్యార్థుల చదువుకు అండగా నిలవాలని కోరారు. దాతలు అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి నిలయ కమిటీ ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్, కోశాధికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, సభ్యులు రామకృష్ణ, నిలయ ప్రముఖులు వరలక్ష్మి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమం వదిలేసి. నిరంకుశ పాలన సాగిస్తున్న రేవంత్ సర్కార్

- రేగ కాంతారావు
- టీజేఎస్ మండల అధ్యక్షులు బిఆర్ఎస్ లో చేరిక





**గుండాల సెప్టెంబర్ 23 ప్రజాజ్యోతి** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమాన్ని గాలికి వదిలేసి నిరంకుశ పాలనను సాగిస్తుందని బి ఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు ఆరోపించారు, బుధవారం మండలంలో పర్యటించిన అనంతరం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వదిలేసి, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తి గా విఫలమయ్యారని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కనపెట్టి రాక్షస పాలన సాగిస్తుందని విమర్శించారు, రేఖంతలో సమక్షంలో టీజేఎస్ మండల అధ్యక్షులు గొల్లపల్లి రమేష్ తో పాటు మరి కొంతమంది టిఆర్ఎస్ పార్టీలో చేరారు వారిని కండవు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు అనంతరం మండల కేంద్రంలోని వినాయక మండపాల దగ్గరకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఇటీవల మృతి చెందిన బొబ్బిలి రమేష్ కుటుంబాన్ని పరామర్శించారు. టిఆర్ఎస్ మండల నాయకులు తిరు కొల్లూరి రాము తండ్రి రామయ్య ఏడాది మాస్టారికి హాజరయ్యారు ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు తెల్లం భాస్కర్, మోకాళ్ళ వీరస్వామి, గడ్డం వీరన్న, వట్టం రవి, లక్ష్మినారాయణ, గడ్డం రమేష్, నిట్ట రాములు, హజ్జు, సుధాకర్, లలిత తదితరులు పాల్గొన్నారు.

## తల్లి వద్దకు తరలి వెళ్లిన గణనాథులు

- శాంతియుతంగా సాగిన గణేష్ నిమజ్జన శోభాయాత్ర





**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 23, (ప్రజా జ్యోతి )** ఈనెల 11వ తేదీన పాల్వంచ పట్టణంలోని పలు ప్రాంతాలలో నెలకొల్పిన గణేష్ ఉత్సవ మండపాలలో తొమ్మిది రోజులపాటు విశేష పూజలందుకున్న గణనాధులను ఆయా ఉత్సవ మండపాల నిర్వహకులు బుధవారం నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు, ఈ సందర్భంగా స్థానిక వర్తక సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడి వద్ద, తూర్పు కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహం వద్ద, అదేవిధంగా పట్టణంలోని పలు వార్డులలో ఏర్పాటుచేసిన ఉత్సవ మండపాల వద్ద తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న గణనాథుడి చేతిలో ఉన్న లడ్డు , పట్టు వస్త్రాలను, కలశాలను, హుండీలను, వేలం పాట వేసిన అనంతరం గణేష్ విగ్రహాలను ట్రాక్టర్ పై ఉంచి వివిధ రకాల పూలతో, విద్యుత్ దీపాలతో, అలంకరించి, డప్పు వాయిద్యాలతో కోలాటం నృత్యాలు చేస్తూ రంగులు జల్లుకుంటూ ప్రధాన రహదారుల మీదుగా ఊరేగింపు చేసుకుంటూ గణనాధులని భక్తిశ్రద్ధలతో జై "బోలో గణేష్‌మహరాజ్" అంటూ భద్రాచలం గోదావరి నదికి తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షం లో కూడా ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఉత్సాహంగా నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు, అదేవిధంగా పలు గణేష్ మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు, నిమజ్జన శోభాయాత్రలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పాల్వంచ డిఎస్పి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో శాంతి భద్రతలను పర్యవేక్షించారు, నిమజ్జనం సందర్భంగా పాల్వంచ పట్టణంలోని వివిధ గణేష్ ఉత్సవ పందిళ్ల వద్ద పాల్వంచ పట్టణానికి చెందిన ప్రముఖులు ,వివిధ పార్టీల నాయకులు, పలువురు కార్పొరేటర్లు, గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పవర్ బాయ్స్ ను అభినందించిన మంత్రి పొంగులేటి






**కొత్తగూడెం కలెక్టరేట్ , సెప్టెంబర్ 23, (ప్రజా జ్యోతి )** భద్రాచలం అశోక్ నగర్ కాలనీలో పవర్ బాయ్స్ ఆధ్వర్యంలో పూర్తిగా పర్యావరణాన్ని కాపాడడంలో భాగంగా మొట్టమొదటిసారిగా ఏర్పాటుచేసిన 21 అడుగుల మట్టి విగ్రహాన్ని తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు, ఈ సందర్భంగా మంత్రి మన ఊరు ,మన గోదావరి, మన మట్టి అన్ని కాన్సెప్ట్ మట్టి విగ్రహం ఏర్పాటుచేసిన పవర్ బాయ్స్ టీమ్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు , అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ , మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు దేవి ప్రసన్న ,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## వర్షాల దృష్ట్యా నేడు, రేపు పాఠశాలలకు సెలవులు

- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబరు 23, (ప్రజా జ్యోతి )** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని, విద్యార్థుల భద్రత దృష్ట్యా జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లాలోని అన్ని పాఠశాలలకు సెప్టెంబర్ 23, 24 తేదీల్లో రెండు రోజులు సెలవులు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేదా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్ని మండలాల ఎం ఈ ఓ లు, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు సంబంధిత ఆర్ సి ఓ లను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.జిల్లాలో కొనసాగుతున్న భారీ వర్షాల నేపథ్యంలో సంబంధిత అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండి, పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు,అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఈ ఆదేశాలను పాటించాలని సూచించారు.

# కేటీపీఎస్ లో ముగిసిన పవర్ జేఏసీ జాయింట్ మీటింగ్

- జేఏసీ మీటింగ్లో పాల్గొన్న టీజీ జెన్కో_ట్రాన్స్కో_ ఎన్పీడీసీఎల్ సీఎండీలు
- ఆర్టిజన్స్_ ఉద్యోగులకు పలు హామీలు ఇచ్చిన సీఎం డి లు

**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబరు 23 ,(ప్రజా జ్యోతి)** పాల్వంచలోనీ స్థానిక కేటీపీఎస్ కాంప్లెక్స్ లో బుధవారం పవర్ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం టీజీ జెన్కో , ట్రాన్స్కో, ఎన్పీడీసీఎల్, సిఎండి ల తో సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా సీఎండీలు పలు సమస్యలపై చర్చించారు, ఈ సమావేశంలో సీఎండీల కు కేటీపీఎస్ ఆర్టిజన్స్, ఉద్యోగులు, దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించగా పలు సమస్యలను పరిష్కరిస్తామని జెన్కో అధికారులు ఆర్టిజన్ కార్మికులకు, ఉద్యోగులకు హామీ ఇచ్చారు, ఇందులో భాగంగా ప్రధానంగా ఆర్టిజన్ కార్మికులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా అన్ ఫార్ విత్ బెనిఫిట్స్ ను అమలు చేస్తామన్నారు , అన్ మ్యాన్డ్ సమస్యపై క్యాబినెట్కు ప్రతిపాదన పంపామని, క్యాబినెట్ నిర్ణయం ప్రకారం అమలు చేస్తామని తెలిపారు. ఈపీఎఫ్ రిటైర్మెంట్ అనంతరం మెడికల్ బెనిఫిట్స్ కల్పిస్తామని, పి ఆర్ సి కమిటీని రెండు వారాల్లో ఏర్పాటు చేస్తామని , అదేవిధంగా జనరల్ బదిలీల విషయంలో రెండు వారాల్లో డిస్కమ్ స్థాయిలో ప్రక్రియ క్లియర్ చేసి అనంతరం అమలు చేస్తామని హామీ ఇచ్చారు, రెగ్యులర్ ప్రమోషన్స్ అన్ని కేడర్లలో నాలుగు నెలల్లో పూర్తి చేస్తామన్నారు, రిక్రూట్మెంట్ ను అన్ని కేడర్లలో చేపడతామని, సబ్ స్టేషన్లలో ఆర్టిజన్ రిక్రూట్మెంట్ కూడా చేపడతామని తెలిపారు. ఈపీఎఫ్ _ జిపిఎఫ్ అంశాన్ని ఫైనాన్స్ డిపార్ట్మెంట్స్ తో చర్చించి నిర్ణయం తెలియజేస్తామని తెలిపారు. 9 2022 పి ఆర్ సి వేతన వ్యత్యాసాలు ఉన్నవారిని 2026 పి ఆర్ సి సరిచేస్తామని హామీ ఇచ్చారు, అదేవిధంగా ఈపీఎఫ్ సెల్లింగ్ విషయంలో ఇప్పటికే ప్రతిపాదించిన ₹15,000నుంచి ₹25,000కు పెంపును తక్షణమే అమలు చేసే చర్యలు తీసుకుంటామన్నారు ,
అనంతరం ఈపీఎఫ్ సెల్లింగ్ అంశంపై మరింత చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వి టి పి ఎస్ _ వై టి పి ఎస్ కాంట్రాక్ట్ విషయంలో ఇది ప్రైవేటీకరణ కాదని, కేవలం కాంట్రాక్ట్ విధానంలో నిర్వహణ మాత్రమే ఉంటుందని తెలిపారు. కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో పనిచేసినా మన ఇంజనీర్ల పర్యవేక్షణలోనే ప్లాంట్ నిర్వహణ జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. 2011 బ్యాచ్ సమస్య పై ప్రస్తుతం డిమాండ్ తమ వద్ద లేదని, దీనిపై ప్రత్యేకంగా చర్చిద్దామని మేనేజ్మెంట్ తెలిపింది.
బిల్ కలెక్టర్కు ,నాన్ ఆర్టిజన్స్ కు సంబంధించిన 136 మంది కార్మికుల సమస్యపై కూడా క్యాబినెట్ నిర్ణయం ప్రకారం అమలు చేస్తామని మేనేజ్మెంట్ హామీ ఇచ్చారు, ఈ జాయింట్ మీటింగ్లో టీజీ జెన్కో సిఎండి హరీష్, టీజీ ట్రాన్స్కో సీఎం డి కృష్ణ భాస్కర్, టీజీ ఎన్పీడీసీఎల్ సిఎండి జితేష్ పాటిల్, టీజీ ఎన్పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, పలువురు ఫైనాన్స్ డైరెక్టర్లు , సభ్యులు ,ఆర్టిజన్ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు

## కూలిన బ్రిడ్జిని పరిశీలించిన కాంగ్రెస్ జిల్లా నాయకులు బత్తుల అంజి



**ములకలపల్లి, సెప్టెంబర్ 23 (ప్రజాజ్యోతి):** మండలంలోని రాజుపేట శివారులో పాములేరు వాగుపై పాల్వంచ–దమ్మపేట ప్రధాన రహదారిలో వరద ఉద్ధృతికి కూలిపోయిన బ్రిడ్జిని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి బుధవారం పరిశీలించారు. బ్రిడ్జి కూలిన తీరును, అక్కడ నెలకొన్న పరిస్థితులను ఆయన పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో ఫోన్లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. ఆర్అండ్బీ అధికారులతో మాట్లాడి ప్రమాదకర ప్రాంతంలో తక్షణమే భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. బ్రిడ్జి కూలిపోవడానికి గల కారణాలను పరిశీలించి, వాహనదారులు, ప్రజలను అప్రమత్తం చేసేందుకు ప్రమాద సూచికలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయడంతో పాటు, ప్రజల భద్రతకు అవసరమైన చర్యలను త్వరితగతిన చేపట్టాలని అధికారులను కోరారు. ఆయన వెంట ఆర్ఐ రాంబాబు, జీపీఓ నవీన్, వెంకటేశ్వరరావు, మండల నాయకులు గాడి తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

## వరద ఉధృతికి కూలిన వంతెన

- పాల్వంచ–దమ్మపేట రహదారిపై రాకపోకలు బంద్



**ములకలపల్లి సెప్టెంబర్ 23 (ప్రజాజ్యోతి):** మండలంలో మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న ఎడతెరిపిలేని భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. బుధవారం పాములేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాజుపేట శివారులో పాల్వంచ–దమ్మపేట ప్రధాన రహదారిపై ఉన్న వంతెన కూలిపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వంతెన కూలిపోవడంతో పాల్వంచ, దమ్మపేట వైపు వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. అధికారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వాహనాలను మళ్లించారు. పాల్వంచ నుంచి దమ్మపేట వెళ్లే వాహనాలు మాధారం, అన్నపురెడ్డిపల్లి–బుగ్గపాడు మీదుగా, దమ్మపేట నుంచి పాల్వంచ వెళ్లే వాహనాలు కంపగూడెం క్రాస్–బూర్గంపాడు మీదుగా వెళ్లాలని సూచించారు. ములకలపల్లి–జగన్నాథపురం వైపు వెళ్లే వాహనాలను కంపగూడెం–గొల్లగూడెం మీదుగా మళ్లించారు.

## ప్లాస్టిక్ రహిత పంచాయతీగా తీర్చిదిద్దుతాం : కోర్సా ఆదిలక్ష్మి



**ములకలపల్లి సెప్టెంబర్ 23 (ప్రజాజ్యోతి):** ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించి మూకమామిడి గ్రామ పంచాయతీని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి అన్నారు. స్వచ్ఛ హి సేవా–2026లో భాగంగా బుధవారం గ్రామ పంచాయతీలో స్వచ్ఛతా హరిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో కలిసి సర్పంచ్ మొక్కలు నాటారు. వాటి సంరక్షణ బాధ్యతను విద్యార్థులు తీసుకోవాలని సూచించారు. అనంతరం ప్లాస్టిక్ రహిత గ్రామం కోసం ప్రతిజ్ఞ చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించబోమని, మార్కెట్కు వెళ్లేటప్పుడు జూట్ లేదా గుడ్డ సంచులను ఉపయోగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీకి అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణంతో పాటు పశువులు, ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. ప్రతి కుటుంబం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దోమల అరుణ్కుమార్, ప్రధానోపాధ్యాయుడు గూగులోత్ భద్రూనాయక్, ఉపాధ్యాయులు, పారిశుధ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్నాబ్ తుఫాన్ పై ఉమ్మడి ఖమ్మం జిల్లా కలెక్టర్లతో ఫోన్లో మాట్లాడిన మంత్రి తుమ్మల



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 23 ,(ప్రజా జ్యోతి)** ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఆర్నాబ్ తుఫాన్ ప్రభావం పై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం రాత్రి పరిస్థితి ని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటన ముగించుకొని హైదరాబాద్ వెళ్లిన మంత్రి ఉమ్మడి ఖమ్మం జిల్లా కలెక్టర్లతో చరవాణి ద్వారా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ తుఫాను ప్రభావం రేపు, ఎల్లుండి ఇంకా తీవ్రంగా ఉండే అవకాశం ఉన్న దృష్ట్యా యంత్రాంగాన్ని అప్రమత్తం గా ఉండాలని ఆయన కోరారు. ఈరోజు, రేపు వినాయక నిమజ్జనాలు ఉండటం, ఈ తుఫాను పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసుకొని క్రింది స్థాయి అధికారులను అప్రమత్తం చేయాలని మంత్రి తుమ్మల కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ తుఫాను ప్రభావం ఎక్కువగా ఉండటంతో అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆ గ్రామాల్లో ఉన్న పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి తుమ్మల ఆదేశించారు.

# చిక్కుల శ్రీను పార్థివదేహానికి నివాళులర్పించిన బత్తుల అంజి

- కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం



**ములకలపల్లి సెప్టెంబర్ 23 (ప్రజాజ్యోతి):** గ్రామపంచాయతీ కార్మికుడు చిక్కుల శ్రీను మృతి బాధాకరమని జిల్లా నాయకుడు, మాజీ జడ్పీటీసీ బత్తుల అంజి అన్నారు. బుధవారం స్థానిక సర్పంచ్ కోర్సా చంద్రలేఖతో కలిసి శ్రీను పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామపంచాయతీ తరపున రూ.10 వేల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. గ్రామపంచాయతీ కార్మికుడిగా శ్రీను అందించిన సేవలను అంజి గుర్తుచేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ రమేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్, శనగపాటి రవి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## చిక్కుల శ్రీను మృతి సీఐటీయూకు తీరని లోటు

- ఆయన ఆశయాల సాధనకు కార్మికులు ఉద్యమించాలి: మచ్చా వెంకటేశ్వర్లు



**ములకలపల్లి సెప్టెంబర్ 23 (ప్రజాజ్యోతి):** చిక్కుల శ్రీను మృతి సీఐటీయూ, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్కు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. సుందరయ్యనగర్లో శ్రీను భౌతికకాయాన్ని సందర్శించి సీఐటీయూ జెండా కప్పి నివాళులర్పించారు. పేదలు, కార్మికుల సమస్యలపై శ్రీను చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ మాట్లాడుతూ శ్రీను పోరాట స్ఫూర్తితో కార్మికుల సమస్యలపై ఉద్యమాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అన్నవరపు సత్యనారాయణ, కొండబోయిన వెంకటేశ్వర్లు, ముదిగొండ రాంబాబు, చేడె పద్మ, నిమ్మల మధు, గంటా శ్రీనివాసరావు, రుక్మధరావు, మేకల రమేష్, కారంపూడి సాయిరత్న, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు

# ప్లాస్టిక్ రహిత లక్ష్మీపురమే లక్ష్యం

- క్లాత్ బ్యాగుల విని యోగాన్ని ప్రోత్సహిం చిన ఎమ్మెల్యే పాయం



**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 23 (ప్రజా జ్యోతి):** గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బూర్గంపహాడ్ మండలం లక్ష్మీపురం గ్రామంలో ప్లాస్టిక్ వినియోగానికి ప్రత్యామ్నాయంగా క్లాత్ బ్యాగుల వినియోగాన్ని ప్రోత్సహించే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బాదం వెంకటేశ్వరరెడ్డి రూపొందించిన క్లాత్ బ్యాగ్‌ను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు ప్లాస్టిక్ బ్యాగులకు దూరంగా ఉండాలని సూచించారు. మార్కెట్లు, దుకాణాలకు వెళ్లే సమయంలో క్లాత్ బ్యాగులను వినియోగించే అలవాటును ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామంలో పరిశుభ్రతను కాపాడేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు.స్వచ్ఛతతో పాటు పచ్చదనానికి ప్రాధాన్యమిస్తూ లక్ష్మీపురం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామంలోని ప్రతి కుటుంబం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి క్లాత్ బ్యాగులను వినియోగిస్తే పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని అన్నారు.గ్రామ ప్రజల్లో అవగాహన కల్పిస్తూ క్లాత్ బ్యాగుల వినియోగాన్ని మరింత విస్తృతం చేయాలని సర్పంచ్ బాదం వెంకటేశ్వరరెడ్డి చేపట్టిన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ ఒడికి గణనాథుడు

- జెడి వానలో వినాయక నిమజ్జనాలు





**గుండాల సెప్టెంబర్ 23 ప్రజా జ్యోతి** తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ గుడిలోకి చేరాడు. బుధవారం మండల కేంద్రంలోని వివిధ సెంటర్లో ఏర్పాటు చేసిన గణనాథుడిని డప్పు వాద్యాలతో, డోలి సప్పులతో ఘనంగా నిమజ్జనం నిర్వహించారు. వర్షం ను సైతం లెక్కచేయకుండా భక్తులు నిమజ్జన కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. మండల కేంద్రంలోని కొత్త గుంపు సెంటర్లో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద వినాయకుని చేతుల్లో ఉన్న లడ్డును వేలంపాట వేయగా 40 వేలకు సనప రాంబాబు దక్కించుకోగా, సుభాష్ నగర్ లో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద వినాయకుని చేతిలో ఉన్న లడ్డును జవ్వాజి ప్రవీణ్ కుమార్ /పందు వేలంలో దక్కించుకున్నాడు. బతుకమ్మ ఘాట్ వద్ద ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద వినాయకుని చేతిలో ఉన్న లడ్డును వేల వేయగా మా జోజు చంద్ర చారి 14 వేలకు దక్కించుకున్నాడు. అమ్మ హోటల్ సెంటర్లో ఏర్పాటుచేసిన వినాయక మండ పం వద్ద వినాయకుని చేతులో ఉన్న లడ్డును సోలం నరసయ్య పదివేలకు వేలంపాటలు అడ్డును తప్పించుకున్నాడు. కాగా ఆయా సెంటర్లలో 9 నవరాత్రులు పూజలు నిర్వహించి బుధవారం ఘనంగా వినాయకుడిని నిమజ్జనం నిర్వహించారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

- అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు
- మంత్రి పొంగులేటి



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 23, (ప్రజా జ్యోతి)** పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార , పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.బుధవారం భద్రాచలం అంబ సత్రం మార్గంలోని కాలనీలో లబ్ధిదారు మామిడి మౌనిక నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటిని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు లతో కలిసి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారు కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేద కుటుంబాలకు సొంతింటి భరోసా కల్పించి వారి జీవితాల్లో ఆనందం నింపాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. అర్హత ఉన్న పేదలందరికీ మూడో విడతలో, అవసరమైతే నాలుగో విడతలోనూ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడినా..? ఫాన్సీ షాపా..?

- అంగన్‌వాడీ గదిలో ఫ్యాన్సీ వ్యాపారం.. వరండాలో చిన్నారులు!
- తల్లిదండ్రుల ఫిర్యాదుతో అధికారుల తనిఖీ.. వస్తువులు బయటకు తరలింపు





**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 23 (ప్రజా జ్యోతి):** చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందించడంతో పాటు గర్భిణులు,బాలింతలకు పౌష్టికాహారం అందించాల్సిన అంగన్‌వాడీ కేంద్రంలో ఫ్యాన్సీ వస్తువులు,చీరలు,జ్యూయలరీ తదితర సామగ్రి ఉంచిన ఘటన బుధవారం ఇరవెండి గ్రామంలో వెలుగుచూసింది. ఇరవెండి–2 అంగన్‌వాడీ కేంద్రంలోని గదిని చిన్నారుల కోసం వినియోగించకుండా వరండాలోనే తరగతులు నిర్వహిస్తున్నట్లు తల్లిదండ్రులు ఆరోపించారు.తల్లిదండ్రుల సమాచారం మేరకు అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించగా.. కేంద్రం గదిలో ఆటబొమ్మలతో పాటు ఫ్యాన్సీ వస్తువులు, చీరలు, జ్యూ యలరీ సామగ్రి, బిస్కెట్లు, చాక్లెట్లు తదితర వస్తువులు ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. చిన్నారులు కూర్చొని పాఠాలు నేర్చుకోవాల్సిన గదిని ఇతర వస్తువుల నిల్వకు వినియోగించడం పట్ల తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. చిన్నారులను వరండాలో కూర్చోబెట్టి అంగన్‌వాడీ కార్యకలాపాలు నిర్వహించడం ఏమిటని వారు ప్ర శ్నించారు.ఈ విషయంపై తల్లిదండ్రుల నుంచి ఫిర్యా దు అందడంతో సర్పంచ్ గుండి బాబూరావు,పంచాయతీ కార్యదర్శి స్పంద న,అంగన్‌వాడీ సెక్టార్ సూ పర్‌వైజర్ సక్కుబాయి కేంద్రాన్ని తనిఖీ చేశారు. అంగన్‌వాడీ గదిలో ఉన్న వస్తువులను బయటకు తరలించి,ఘటనకు సంబంధించిన విషయాన్ని సీడీపీవో దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం ప్రధాన ఉద్దేశం చిన్నారులకు సురక్షితమైన వాతావరణంలో విద్య, ఆటలు,పోషకాహారం అందించడమేనని అధికారులు పేర్కొన్నారు. ఇకపై కేంద్రాన్ని నిర్దేశించిన గదిలోనే నిర్వహించాలని,చిన్నారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూ చించారు. అలాగే కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందే లా చర్యలు తీసుకోవాలని ఆదేశించా రు.అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షణ పెంచాలని తల్ లిదండ్రులు కోరుతున్నారు. ఈ ఘటన పై ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి, వాస్తవాలను వెల్లడించాలని వారు కోరుతున్నారు.

## జిన్నెలగూడెంలో ఘనంగా గణేష్ నిమజ్జన వేడుకలు





**ఆళ్ళపల్లి, సెప్టెంబర్ 23 (ప్రజాజ్యోతి)** మర్కోడు గ్రామపంచాయతీ పరిధిలోని జిన్నెలగూడెంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద దయాకర్ చారి–లక్ష్మీ ప్రసన్న జ్యూయలరీ ఆధ్వర్యంలో బుధవారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గణనాథుడి నిమజ్జన వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న లడ్డూ ప్రసాదాన్ని వేమూరి హరిబాబు–స్వప్న దంపతులు రూ.6,516లకు, కలశం పాటను వేమూరి రవి–మమత దంపతులు రూ.4,316లకు దక్కించుకున్నారు.కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అంబోజు నవీన్, సభ్యులు అంబోజు సాయి, శ్యాంసుందర్, నిట్ట నిఖిల్, అఖిల్, పోతురాజు సత్యనారాయణ, చిట్టిమల్ల యశ్వంత్, ప్రవీణ్, సాత్విక్, చిట్టిమల్ల రమేష్, బిక్షం, నిట్ట వెంకట్రావు, సుధాకర్, వేమూరి సత్యం, వేమూరి నవీన్, రవికుమార్, హరిబాబు, వేమూరి నరసింహారావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ పెద్ద చిట్టిమల్ల బాబు, సర్పంచ్ సుతారి రమాదేవి, ఉప సర్పంచ్ వగలబోయిన సతీష్, రెండో వార్డు సభ్యురాలు కెక్కర్ల సునీత, కాంగ్రెస్ మండల నాయకులు సుతారి కృష్ణ, మాజీ జెడ్పీటీసీ కొమరం హనుమంతరావుతో పాటు గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సకల జనావళి కొలిచి, పూజించే దేవుడు గణేషుడు

**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 23, (ప్రజా జ్యోతి)**

సకల జనావళి కొలిచి, పూజించే దేవుడు గణేషుడు అని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్,రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాస రావు అన్నారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా బుధవారం పాల్వంచలోని ప్రాంతాల్లో జరిగిన శోభాయాత్రలో కొత్వాల తో పాటు పాత పాల్వంచ 46 డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి పాల్గొని పూజలు చేశారు. పాత పాల్వంచ లో జిడికె యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఊరేగింపులో పాల్గొని నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ ఆదిదేవుడు వినాయకుడు ఆశీస్సులు, అందరికీ ఉంటాయని అన్నారు. అదేవిధంగా పాత పాల్వంచ గడియకట్టలో గణేషుని పూజల్లో కొత్త వాళ్ళ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదానం కార్యక్రమాల్లో పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో పాత పాల్వంచ 46 వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి తదితరులు పాల్గొన్నారు.